## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎంవీఐ సిబ్బంది

**పాలకుర్తి:** బసంత్‌నగర్ సమీపంలోని బుగ్గ క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రామగుండం ఎంవీఐ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు బూడిద సరఫరాల చేసే లారీలు ఓవర్‌లోడ్‌తో వస్తున్నాయని, ఓవర్‌లోడ్ లారీలను నియంత్రించాలన్న జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వాటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఫోర్‌లైన్ రహదారిపై ప్రయాణించే వివిధ వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

### చెత్త రీసైక్లింగ్‌పై అవగాహన

**కోల్‌సిటీ:** రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా చెత్త రీ సైక్లింగ్ చేసే ప్రక్రియపై మెప్మా ఆర్పీలకు అధికారులు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మెప్మా విభాగం సిబ్బంది, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్తను కంపోస్టుగా ఇంటి వద్దనే మార్చుకునే ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. అనంతరం వారితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. నగరపాలక సంస్థ సెక్రటరీ రాజు, సూపరింటెండెంట్ ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, టీఎంసీ ఊర్మిళ, సీవో శ్వేత పాల్గొన్నారు.

### జిల్లా పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

**సుల్తానాబాద్‌రూరల్:** ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలకు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ గిరిజ తెలిపారు. సుల్తానాబాద్‌లో 24, 25 తేదీలో జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో వాలీబాల్ అండర్–14లో స్నిగ్ధిత, వర్షిణి, అక్షయ, అండర్–17లో హృతిక, ఖోఖో అండర్–17లో సాయిదీప్తి, అండర్–17 400 మీటర్స్‌లో సాయిదీప్తి, దీప్తి, శ్రీగంగా, లాంగ్‌జంప్‌లో సంగీత, కబడ్డీ అండర్–14లో సన్నిహిత, ఖోఖోలో వినీల, డిస్కస్‌త్రో మానస, 400 మీటర్స్‌లో అక్షిత ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థులను పీడీ జాహ్నవి, పీఈటీ అంజలి అభినందించారు.

### కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

**ముత్తారం:** మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ మెంగని తిరుపతి పటేల్ గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన తిరుపతికి శ్రీధర్‌బాబు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మద్దెల రాజయ్య ఉన్నారు.

### ఫ్రెషర్స్ డే హంగామా



**గోదావరిఖనిటౌన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

### దరఖాస్తులు ఆహ్వానం

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులోని ఆదర్శ (మోడల్) విద్యాలయంలో గంటల ప్రాతిపదికన 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, ఎకానమిక్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురువారం ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ పొలిటికల్ సైన్స్, పీజీటీ ఎకానమిక్స్ బోధనకు సంబంధించిన సబ్జెక్టుల్లో 50శాతం మార్కులతో బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులుగా ప్రకటించారు. ఆసక్తి గల అభ్యర్థులు 28వ తేదీలోగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న మేయర్ అనిల్‌కుమార్



పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్‌లో..

## చాకలి ఐలమ్మ జయంతి

**గోదావరిఖని:** వెట్టి చాకిరీ వ్యవస్థపై పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు కనకరాజు, బీఆర్‌ఎస్ సీనియర్ ఉద్యమకారుడు బొడ్డు రవీందర్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని గురువారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించారు.
**కోల్‌సిటీ:** రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ చిత్రపటానికి నగర మేయర్ అనిల్‌కుమార్ నివాళి అర్పించారు.
**గోదావరిఖనిటౌన్:** స్థానిక కోర్టు సమీపంలోని చాకలి ఐలమ్మ చౌరస్తాలో నివాళి అర్పించారు.
**సుల్తానాబాద్:** మున్సిపల్ సమీపంలో ఐలమ్మ విగ్రహానికి చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి పూలమాల వేసి నివాళి అర్పించారు.
**జూలపల్లి:** జూలపల్లిలోని రజక కమ్యూనిటీ భవనంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి, పెద్దాపూర్‌లో బస్టాండు వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
**జ్యోతినగర్:** మేడిపల్లి సెంటర్‌లో ఎన్టీపీసీ పట్టణ రజక సేవా సంఘం అధ్యక్షుడు పూసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.
**ధర్మారం:** మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు.
**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో చాకలిఐలమ్మ జయంతి నిర్వహించారు. పట్టణంలోని తిలక్‌నగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి చైర్‌పర్సన్ మమతారెడ్డి నివాళి అర్పించారు.
**మంథని:** పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో, రజక సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ శ్రేణులు నివాళి అర్పించారు.
**కమాన్‌పూర్:** మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు.



ధర్మారం: నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్



మంథని: నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ రమ

## గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

**సుల్తానాబాద్:** క్రీడాకారులు గెలుపోటమలను సమానంగా తీసుకోవాలని డీవైఎస్‌వో సురేశ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం జోనల్ అథ్లెటిక్స్, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, ఎంఈవో రాజయ్య, జోనల్ ఇన్‌చార్జి దాసరి రమేశ్, మండల ఇన్‌చార్జి ప్రణయ్, స్పోర్ట్స్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, కుమార్ కిషోర్, హరికృష్ణ, కుమార్ మహేందర్, మధుకర్, సంధ్య, ఆసియా, ప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక అధికారులు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు పీఈటీలు బహుమతి అందజేశారు.



తలపడుతున్న సుల్తానాబాద్–జూలపల్లి జట్లు

## కాంగ్రెస్ నాయకుడి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే



పాడె మోస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

**ఎలిగేడు:** మండలంలోని లాలపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కొప్పెర తిరుమల్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. తిరుమల్‌రెడ్డి స్వగ్రామం లాలపల్లికి గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కుటుంబ సభ్యులతో వెళ్లి తిరుమల్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దుగ్యాల సంతోష్‌రావు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

**పాలకుర్తి:** మండలంలోని పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సపాయి మిత్ర సురక్ష శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పుట్నూర్, జయ్యారం, గుడిపల్లి, కుక్కలగూడూర్, వేంనూర్, ఈసాలతక్కళ్లపల్లి, రామారావుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పనిచేసే పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యుడు సాయిసూర్య ఆధ్వర్యంలో బీపీ, షుగర్, తెమడ, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో సుదర్శన్, కార్యదర్శి సుమలత పాల్గొన్నారు. అదేవిధంగా బసంత్‌నగర్ పీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగయ్య పాల్గొని ఆసుపత్రిలో మొక్కలు నాటారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్, సెక్షన్ ఆఫీసర్ రహమతుల్లాఖాన్, ఎంపీడీవో శశికళ, వైద్యురాలు హరితభవాని పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

**ఓదెల:** గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తిలో గురువారం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ ప్రారంభించారు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి, పెద్దపల్లి మార్కెట్ డైరెక్టర్ పిట్టల కొమురయ్య, మత్స్యశాఖ అధ్యక్షుడు రాజేశం పాల్గొన్నారు.

## ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**పాలకుర్తి:** మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్, కార్యదర్శి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఈఎన్నికల్లో బొల్లి సాయిరాజ్, వైద్య నరేశ్ ప్యానెల్‌లు బరిలో నిలవగా నరేశ్ ప్యానెల్ విజయం సాధించింది. అధ్యక్షుడిగా వైద్య నరేశ్(పుట్నూర్), ప్రధాన కార్యదర్శిగా మాదాసు భూమయ్య(పాలకుర్తి), కోశాధికారిగా సంగెం ప్రకాశ్(ఈసాలతక్కళ్ళపల్లి) ఎన్నికయ్యారు. ఫొటోగ్రాఫర్లు రాంకుమార్, పికిలింక శ్రీనివాస్, ఓడ్నాల కిషన్, రామ్మూర్తి, మధుగౌడ్, లక్ష్మణ్, వెంకటేశ్, చిలుక ప్రమోద్, కాదాసి తిరుపతి, ప్రసాద్ పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పోగుల విజయ్

## ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

**సుల్తానాబాద్:** ఎస్జీఎఫ్ క్రీడల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు ఐపీఎస్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్ తెలిపారు. గురువారం పాఠశాలలో జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**గోదావరిఖని:** కార్మికులకు అన్యాయం చేసే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పోస్టర్ విడుదల చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 30న నిర్వహించే చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఇ.నరేశ్, ఎడ్ల రవికుమార్, ఎన్.రాజేందర్, జి.రాజు, కిష్టయ్య, చిన్నయ్య, వెంకటేశ్, గాజుల రమేశ్, ఎస్.కృష్ణ, శివశంకర్, మధు, కనకయ్య పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**● ఇసుక లారీ బోల్తా**

**మంథని:** పెద్దపల్లి–మంథని ప్రధాన రహదారిలోని గంగాపురి సమీపంలో గురువారం ఇసుక లారీ బోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే అడవి సోమన్‌పల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఇసుక లారీ గంగాపురి గ్రామ సమీపంలో అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న తాటిచెట్టును ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్తున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న లారీ డ్రైవర్‌ను స్థానికులు, తోటి లారీ డ్రైవర్లు బయటకు తీశారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

**● ఓసీపీ–1లో ఫిట్టర్‌కు గాయాలు**

**గోదావరిఖని:** సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3పరిధిలోని ఓసీపీ–1లో గురువారం ఫిట్టర్ కార్మికునికి గాయాలయ్యాయి. క్వారీలోని బిలాయ్ ఐఆర్ ఫీడర్–1 కన్వేయర్ బెల్ట్ వద్ద అదుపు తప్పి కిందపడటంతో కె.సత్యనారాయణ కాలు ఫ్రాక్చర్ అయింది. లూప్‌టేకప్ టైట్ చేస్తుండగా అదుపుతప్పి డ్రమ్ము వద్ద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

**● ఇటుకబట్టి కూలీ మృతిపై కేసు నమోదు**

**యైటింక్లయిన్‌కాలనీ:** గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి జనగామ గ్రామ శివారులోని ఏఏ ఇటుకబట్టీలో పనిచేస్తున్న నిరంజన్ సింగ్ బోరియా(40)మృతిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఒడిషాకు చెందిన నిరంజన్‌సింగ్ 15రోజుల క్రితం ఉపాధికోసం గ్రామ శివారులోని ఏఏ ఇటుకబట్టీలో పనిలో చేరాడు. బుధవారం మధ్యాహ్నం నిరంజన్ సింగ్‌తో పాటు జయకుమార్, గోదావరి నదిలో పట్టిన చేపలను వండచేసుకొని తిన్నారు. వారికి వాంతులు, విరోచనాలు కావడంతో ఇటుకబట్టీ నిర్వాహకులు వీరిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా నిరంజన్‌సింగ్ బుధవారం అర్ధరాత్రి మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**● చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

**ఎలిగేడు:** ప్రమాదవశాత్తు కాలుజారి మెట్లపై నుంచి కింద పడిన మండలంలోని ధూళికట్టకు చెందిన మారం సతీశ్(34) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం మారం సతీశ్ 21న సాయంత్రం వర్షం పడుతుండగా బిల్డింగ్ మెట్లు ఎక్కే ప్రయత్నంలో కాలుజారి మెట్లపై నుంచి పడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

**● గీత కార్మికుడికి తీవ్రగాయాలు**

**జూలపల్లి:** మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు అమరగాని చంద్రయ్య తాటి చెట్టుపై నుంచి పడగా తీవ్ర గాయాలపాలయ్యాయి. కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన చంద్రయ్య కాళ్లకు వేసుకున్న గుజి జారడంతో చెట్టుపై నుంచి జారిపడగా, ఎముకలు విరిగాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్‌కు తరలించారు. కాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లి చికిత్స ఇప్పిస్తున్నారు.

**● ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత**

**సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్:** మండలంలోని బొంతకుంటపల్లి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కదంబాపూర్‌లో ఇసుక పట్టి సన్న ఇసుకగా మార్చి సిమెంట్ బ్యాగుల్లో నింపి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు దాడి చేసి వాహనంతో పాటు 150 ఇసుక బస్తాలు సీజ్ చేసి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

**● బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు**

**ముత్తారం:** ముత్తారంలోని పోలీస్‌స్టేషన్ ముందు ఓ బైక్‌కు గురువారం కోతి అడ్డురావడంతో అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కమాన్‌పూర్‌కు చెందిన రాజు ముత్తారం నుంచి పనినిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ ముందు కోతి అకస్మాత్తుగా రావడంతో కిందపడ్డాడు. పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న కానిస్టేబుల్ సంతోష్, హోంగార్డు రాజు గాయపడిన చోట కట్లు కట్టి ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**● పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు**

**కమాన్‌పూర్:** మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

**● ధర్నా విజయవంతం చేయండి**

**రామగిరి:** బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ ఆధ్వర్యంలో 27న ఉదయం 10గంటలకు ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని ఏరియా కార్యదర్శి రమేశ్ కోరారు.

**● పరామర్శ**

**కాల్వశ్రీరాంపూర్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని మీర్జంపేటకు చెందిన సురేశ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం రాత్రి పరామర్శించారు.

**● డీటీఎఫ్ సభ్యత్వ నమోదు**

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ అన్నపూర్ణకాలనీలోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాల, న్యూపీకే రామయ్యకాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని కిరణ్‌కుమార్, స్టేట్ కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.
**రామగుండం:** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బయ్యపు సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు మొక్కలు అందజేస్తూ నూతన సభ్యత్వం నమోదు చేయించారు.

**రామగుండం:** పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మించి మూడు దశాబ్దాలు పూర్తవడంతో క్రమంగా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బుధవారం వేకువజామున కురిసిన భారీ వర్షంతో డ్రైనేజీకి ఇరువైపులా బండరాళ్ల గోడలు కుప్పకూలడంతో ఓ వ్యక్తి వాహనంతో అందులో పడిపోయాడు. ఈ ప్రమాదంలో వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగకపోగా వాహనం స్వల్పంగా దెబ్బతిన్నది. నోటిఫైడ్ ఏరియా స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి చేరినప్పటికీ డ్రైనేజీ దుస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. పట్టణ ప్రజలకు ఇదే ప్రధాన సమస్య. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి తక్షణమే ప్రధాన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



**వాట్సాప్ చేయండి..**

**మా ఫోన్ నంబర్ : 97053 46608**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

## సింగరేణి వార్తలు

### స్వచ్ఛత క్యాంపెయిన్ విధివిధానాలపై సమీక్ష

**రామగిరి:** సింగరేణి వ్యాప్తంగా నిర్వహించనున్న స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్‌పై గురువారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో జీఎం ఎస్.సుధాకర్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్జీ–3 ఏరియాలో నిర్వహించాల్సిన పనుల విధివిధానాలపై అధికారులతో చర్చించారు. సెప్టెంబర్ 30 వరకు అవసరమైన క్లీనింగ్ చేసి భద్రపర్చాల్సిన పనిస్థలాలు, ఆఫీస్ ఫైల్స్ గుర్తించడం, అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకు గుర్తించిన టార్గెట్‌లను పూర్తి చేయడం, క్లీనింగ్ ముందు, తర్వాత ఫొటో తీయడంతో పాటు వాటి రికార్డులను భద్రపరచాలి. అందుకు కావాల్సిన తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, ప్రాజెక్టు అధికారి సీహెచ్ వెంకటరమణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, ఎస్టేట్ అధికారి కె.ఐలయ్య, అటవీ విభాగాధిపతి కళ్యాణ్, ఐటీ అధికారి ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న జీఎం సుధాకర్‌రావు

### వాస్తవ లాభాలు చెల్లించాలి

**గోదావరిఖని:** వాస్తవ లాభాల్లో వాటా చెల్లించాలని కోరుతూ గురువారం ఆర్జీ–1 ఏరియాలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రకారం కార్మికులకు రూ.1550 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా వాటిని తక్కువ చేసి రూ.796 కోట్లు మాత్రమే కార్మికులకు చెల్లిస్తున్నారన్నారు. పూర్తి లాభాల్లో వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ వాస్తవ లాభాలు అందించేలా ఎమ్మెల్యే చొరవ చూడాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, రాజేశం, జోసెఫ్, శ్రావణ్, కోటిలింగం, సారయ్య నాయక్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

### సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు చెల్లించాలి

**యైటింక్లయిన్‌కాలనీ:** సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా సెక్యూరిటీ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 30న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. నాయకులు లింగారెడ్డి, రమేశ్, రవీందర్, నరేశ్, రాకేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో ఆటల పోటీలు

**ఫెర్టిలైజర్‌సిటీ:** అంతర్జాతీయ వయవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో గురువారం ఆటలపోటీలు నిర్వహించారు. రామగుండం సీడీపీవో అలేఖ్య ఆశ్రమంలోని వృద్ధులకు మ్యూజిక్ చైర్, పాటల పోటీలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా సంక్షేమశాఖ సూపరింటెండెంట్ రాజయ్య, జిల్లా సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు పీటీ స్వామి, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి స్వర్ణలత, మహిళా సాధికారత సంధ్య, స్వప్న, పోషణ అభియాన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న వృద్ధులు

### వాతావరణ మార్పులతోనే వరికి తెగులు

**కాల్వశ్రీరాంపూర్:** మండలంలోని కిష్టంపేట, మొట్లపల్లి గ్రామాల్లో గురువారం ఏవో నాగార్జున క్షేత్రస్థాయిలో సందర్శించారు. వాతావరణ మార్పులతో వరిపంటకు వచ్చే తెగుల్లు వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

**సస్యరక్షణ చర్యలు చేపట్టాలి**

**జూలపల్లి:** రైతులు వరిలో వచ్చే ఎండాకు తెగులు, బ్యాక్టీరియా, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. మండలంలోని కుమ్మరికుంటలో రైతుల వరిపంట పొలాలను ఏఈవోతో కలిసి ఆమె పరిశీలించారు. వాతావరణం మార్పుల సమయంలో ప్రతీరోజు వరిపంటను పరిశీలించాలన్నారు. ఏఈవో శ్రీవాణి, రైతులు సంతోష్‌రావు, ఆనందరావు, ఓరుగంటి రవీందర్‌రావు, సదానందం, వెంకటేశం, అజయ్ ఉన్నారు.

### డీజీఎంకు సన్మానం

**యైటింక్లయిన్‌కాలనీ:** సింగరేణి ఆర్జీ–2 ఏరియా డీజీఎం పర్సనల్ అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ అనిల్‌కుమార్‌ను గురువారం రాష్ట్ర గుర్తింపు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ట్రస్మా నాయకులు సన్మానించారు. సింగరేణి ప్రభావిత గ్రామాలు, కాలనీ సమీపంలో ఉన్న పాఠశాలల వివరాలు డీజీఎంకు వివరించారు. నాయకులు రాజయ్య, లక్ష్మణ్‌కుమార్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

### ఆర్‌ఎంపీ వైద్యుడి విగ్రహావిష్కరణ

**ధర్మారం:** మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన స్వర్గీయ ఆర్‌ఎంపీ వైద్యుడు బొడ్డు నారాయణ విగ్రహాన్ని గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. నారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మాజీ మంత్రి ఆవిష్కరించారు.

### సభ విజయవంతం చేయండి

**గోదావరిఖని:** ఎన్టీపీసీ లక్ష్మినర్సింహగార్డెన్‌లో 29న నిర్వహించే మాల కులబాంధవులు, ఉద్యోగుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మాల అధ్యక్షుడు బద్దం డానియల్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు.